పల్లెల్లో పడకేసిన వైద్యం

- వైద్యుల సమ్మెతో నిలిచిన సేవలు
- 104 సేవలు అంతంతమాత్రం
- రోగుల గోడు పట్టని ప్రభుత్వం



వైద్యులు లేక నిర్మానుష్యంగా ఉన్న కృష్ణదేవిపేట పీహెచ్‌సీ

గొలుగొండ : పేదలకు వైద్య సేవలు కరువయ్యాయి. ఆసుపత్రికి వస్తే వైద్యులు అందుబాటులో లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే గ్రామాల్లో నిర్వహించే 104 సేవలు అంతంతమాత్రంగా అందుతున్నాయి. వైద్యుల సమ్మె కారణంగా మండలంలో మూడు పిహెచ్‌సీ పరిధిలో పేదలకు వైద్య సేవలు దూరం కావడం జరుగుతుంది. కూటమి ప్రభుత్వం వైద్యులకు న్యాయం చేయలేదని డాక్టర్లు అంతా 10 రోజుల నుంచి సమ్మెలో ఉండడంతో పీహెచ్‌సీలు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రిలో పేదలకు వైద్య సేవలు దొరకక ప్రైవేట్ క్లినిక్‌లకు వెళ్లి వేలాది రుపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది.

10 రోజుల నుంచి దాక్టర్లు లేక

గొలుగొండ మండలంలో గొలుగొండ, కృష్ణదేవిపేట, చీడిగుమ్మల పిహెచ్‌సీ పరిధిలో ఆరుగురు డాక్టర్లు 15 సబ్ సెంటర్లు పరిధిలో సేవలు అందిస్తుంటారు. సుమారుగా 50వేలకు పైగా ఉన్న జనాభా కలిగిన ఈ మండలంలో 10 రోజు నుంచి ప్రజలకు వైద్య సేవలు అందడం లేదు. ఈ మూడు పీహెచ్‌సీల పరిధిలో ప్రతిరోజు 700 మంది రోగుల వరకు ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకొని మందులు తీసుకోవడం జరుగుతుంది. వైద్యులకు కూటమి సర్కార్ పీజీ, ఇతర సౌకర్యాల విషయంలో మొండి చేయి చూపించడంతో వీరంతా సమ్మె బాట పట్టారు. దీంతో మూడు పీహెచ్‌సీల పరిధిలో కనీసం 100 కూడా రోగులు వెళ్లలేదు. వీరంతా ప్రైవేటు వైద్యులను ఆశ్రయించాల్సి వస్తోంది.

ప్రైవేట్ దాక్టర్లను ఆశ్రయించి

గ్రామాల్లో ఉన్న పేదలకు వైద్య సేవలు పొందాలంటే ప్రభుత్వ ఆసుపత్రులే దిక్కు. ఇక్కడ వైద్యులు పరీక్షలు చేసి అక్కడే ఉచితంగా మందులు అందజేయడం జరుగుతుంది. వైద్యులు సమ్మె బాట పట్టడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో పేదలంతా ప్రైవేట్ డాక్టర్ల వద్దకు వెళ్లి వేలాది రుపాయాలు ఖర్చు చేయాల్సి వస్తోంది. విశాఖ, నర్సీపట్నం ప్రాంతీయ వైద్యశాల నుంచి కొంత మంది వైద్యులను పీహెచ్‌సీలకు పంపుతున్నారు. అయితే ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న డాక్టర్లు తక్కువ సమయం ఉండి వెళ్లిపోతుండడంతో రోగులకు సేవలు అందడం లేదు. రోగులకు అక్కడే ఉన్న సిబ్బంది మందులు అందిస్తున్నారు.

గ్రామాల్లో అంతంతమాత్రమే

గొలుగొండ మండలం పరిధిలో ప్రతీ రోజు ఎంపిక చేసిన గ్రామంలో 104 సేవలు అందించాలి. దీని కోసం ఆస్పత్రి పరిధిలో ఉన్న ఇద్దరు డాక్టర్లలో ఒక డాక్టర్, 104తో ఒక డాక్టర్ పీహెచ్‌సీలో వైద్య సేవలు అందించాలి. కానీ ఆసుపత్రిలో వైద్య సేవలు లేక, గ్రామాల్లో దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడుతున్న, ఇతర వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందించడానికి ఒక డాక్టర్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో స్థానికంగా ఉన్న ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఇతర సిబ్బంది 104 వాహనం వచ్చినప్పుడు నేరుగా దిగువస్థాయి సిబ్బంది పరీక్షలు లేకుండానే మందులు అందిస్తున్నారు. మరోవైపు భారీ వర్షాలు కారణంగా ప్రతి గ్రామంలో జ్వరాలు పీడిస్తున్నాయి. దీంతో ప్రజలకు ప్రైవేటు ఆస్పత్రులే దిక్కవుతున్నాయి.


వైద్యులు లేక ఆస్పత్రిలో సేవలు అందిస్తున్న సిబ్బంది


గ్రామాల్లో ఎంఎల్‌హెచ్‌పీ ద్వారా 104 సేవలు

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్నాయి. మాది డొంకాడ గిరిజన గ్రామం. అనారోగ్యం వస్తే ఆసుపత్రికి వెళితే వైద్యులు అందుబాటులో లేరు. ప్రైవేట్ దాక్టర్ల వద్దకు వెళితే చాలా ఖర్చు అవుతుంది. ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు అందలేదు.

– సత్తిబాబు, డొంకాడ , గొలుగొండ మండలం

వీజేపురంలో డీఫారం రైతులతో గ్రామ సభ


గ్రామసభలో పాల్గొన్న ఎమ్మెల్యేలు బండారు, కెఎస్ఎన్ఎస్‌రాజు తహసీల్దార్ రమాదేవి

మాడుగుల: మండలంలో వీజేపురం గ్రామంలో మంగళవారం సాగులో ఉన్న డి.ఫారం భూముల రైతులు ఎంజైమెంట్ సర్వే గ్రామసభ నిర్వహించారు.ఉర్లోవకొండ, నాగల్లకొండ, కొప్పుకొండ, అడ్డుకొండ పరిధిలో సాగులో ఉన్న డీఫారం భూములను వెబ్ ల్యాండ్‌లో చేర్చడానికి ఆ రైతులతో గ్రామ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు కె.ఎస్.ఎన్.ఎస్ రాజు, బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడారు. ఆయా పరిధిలో గ్రామ సభలు ఏర్పాటు చేసి డీఫారం భూములను వెబ్ ల్యాండ్‌లో చేర్చాలని సంబంధిత రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ మాట్లాడారు. ఉర్లోవకొండ పరిధిలో 2010 దివంగత నేత వై.ఎస్.-రాజశేఖర్‌రెడ్డి అప్పటిలోనే డీ ఫారం పట్టాలు అందజేశారని గుర్తుచ ఏశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో వెబ్‌ల్యాండ్‌లో భూమి ఉంటేనే ప్రభుత్వ పథకాలు వర్తింప జేస్తున్నారని తెలిపారు. ఈ పరిధిలో ఉన్న డీఫారం భూములకు కొత్తగా రెవెన్యూ గ్రామం ఏర్పాటు చేయడం గాని లేక ఏదో ఒక రెవెన్యూ గ్రామంలో సర్వే చేసి వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేస్తే రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. తహశీల్దార్ రమాదేవి మాట్లాడుతూ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి ఎంజైయ్‌మెంట్ సర్వే చేసి డీఫారం భూములను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసి రైతులకు న్యాయం చేస్తామన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఉండూరు దేముడు, పెద్దేరు చైర్మన్ అద్దేపల్లి జగ్గారావు, నందారపు సన్యాసిరావు, జయరామ్ పాల్గొన్నారు.

18న విశాఖలో సామాజిక న్యాయంపై సదస్సు



పోస్టరు ఆవిష్కరిస్తున్న కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి చిరంజీవి

రోలుగుంట : ఈనెల 18న విశాఖపట్నంలో జరగనున్న 'సామాజిక న్యాయం ప్రైవేటు రంగంలో రిజర్వేషన్' సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ సంఘ సభ్యులతో కలసి రోలుగుంటలో మంగళవారం పోస్టర్‌ను కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఇ.చిరంజీవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వరంగ పరిశ్రమలు కేంద్ర ప్రభుత్వం ప్రైవేటుపరం చేయడం ఆపాలన్నారు. ఇప్పటికే దేశంలో అనేక ప్రైవేటు పరిశ్రమలున్నాయన్నారు. వాటిలో వెనుకబడిన వర్గాల వారికి ఎస్సీ,ఎస్టీ, బీసీ రిజర్వేషన్ కల్పించాలని అన్నారు. దళితులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ సామాజిక న్యాయం తదితర అంశాలపై ఈ నెల 18న జరగనున్న సదస్సుకి ముఖ్య అతిథిగా పార్లమెంటు సభ్యుడు రాధాకృష్ణన్, డి.ఎస్.ఎస్. ఎం.జాతీయ అధ్యక్షుడు పి.శ్రీనివాస్. సిహెచ్. నర్సింగరావు, సిఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హాజరవుతారని, సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

గోతిలో కూరుకుపోయిన క్వారీ లారీ


రోడ్డు మధ్యలో నిలిచిపోయిన క్వారీ లారీని పొక్లెయిన్ సహాయంతో తొలగిస్తున్న దృశ్యం

రావికమతం: మేడివాడ నుంచి గర్నికం వరకు రోడ్డు పూర్తిగా పాడైపోయి బీఎన్ రోడ్డు మధ్యలో పెద్ద గోతులు పడ్డాయి. దీంట్లో వర్షపు నీరు చేరడంతో లోతు అంచనా వేయలేక చోదకులు వాహనాలను అదుపు చేయలేకపోతున్నారు. ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.ముఖ్యంగా రాత్రి సమయంలో గోతుల్లో నీరు అంచనా వేయలేక వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే క్రమంలో చోడవరం వైపు వెళ్లే గ్రానైట్ లారీ మేడివాడ వద్ద మంగళవారం కూరుకుపోయింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. రోడ్డు పై గోతిలో కూరుకుపోయిన క్వారీ లారీని రెండు పొక్లెయిన్‌ల సహాయంతో బయటికి తీశారు.

గంబూషియా చేపల విడుదల


మాడుగుల మోదమాంబ కాలనీలో గంబూషియా చేపలు విడుదల చేస్తున్న వైద్య సిబ్బంది

మాడుగుల రూరల్: నీరు నిల్వ వుండి, దోమలు గుడ్లు పెట్టి, లార్వాను పెరిగే ప్రదేశాల్లో దోమల నివారణకు గంబూషియా చేప పిల్లలు విడుదల చేశారు. మంగళవారం చోడవరం సబ్ యూనిట్ పరిధిలో 72 ప్రదేశాల్లో ఈ చేపలు విడుదల చేసినట్లు చోడవరం మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్.వి. రమణ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, జిల్లా మలేరియా అధికారి వరహాలు సారధ్యంలో కె.జె.పురం పీహెచ్‌సీ పరిధిలో గల మాడుగులలో మోదమాంబ కాలనీలో, పోలీసు గ్రౌండు వద్ద, మోదమాంబ ఆలయం సమీపంలో ఈ చేపలు విడుదల చేశామన్నారు. ఈ చేపలు దోమల లార్వాను తినేసి దోమలు పెరగకుండా దోహదపడతాయన్నారు. కార్యక్రమములో కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసాదుపాత్రుడు పాల్గొన్నారు.

అవంతి కళాశాలలో సందడిగా ఫ్రెషర్స్ డే వేడుకలు



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న విద్యాసంస్థల చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు


సాంస్కృతిక కార్యక్రమంలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

నర్సీపట్నం : మాకవరపాలెం అవంతి కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ మంగళవారం నర్సీపట్నంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. అవంతి విద్యా సంస్థల వ్యవస్థాపకుడు, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఈ వేడుకలకు అధ్యక్షత వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విజయనగరం జేఎన్‌టీయు డైరెక్టర్, అకడమిక్ ప్లానింగ్ ప్రొఫెసర్ కె.చంద్రభూషణరావు, విశాఖ 13వ ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్ కుమార్, బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయ సిస్టర్ శృతి, కళాశాల ప్రిన్సిపాల్ డా.సి. మోహన్‌రావు హాజరయ్యారు. ప్రొఫెసర్ చంద్రభూషణరావు మాట్లాడుతూ జూనియర్ విద్యార్థుల్లో ఉన్న భయాన్ని తొలగించి చదువు మీద శ్రద్ధ చూపించే విధంగా ప్రేరేపించడానికి ఈ వేడుకలు దోహదపడతాయన్నారు. అవంతి విద్యా సంస్థల చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ కళాశాల ప్రాంగణం ర్యాగింగ్ రహితమని అన్నారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులతో సోదరభావంతో ఉండాలన్నారు. ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్ కుమార్ మాట్లాడుతూ చేసే పని ఏదైనా మీకోసం శ్రద్ధతో చేయాలన్నారు. ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్‌లో చేరి దేశ రక్షణలో భాగస్వాములు కావాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. సి.మోహన్‌రావు మాట్లాడుతూ అవంతి ఇంజినీరింగ్ కళాశాల 25 ఏళ్ల క్రితం గ్రామీణ ప్రాంతంలో స్థాపించి బీటెక్, ఎంటెక్ వంటి టెక్నికల్ కోర్సులతో పాటు ఎంబీఎ, ఎంసీఏ వంటి ప్రొఫెషనల్ కోర్సులను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. 2023లో కళాశాలకు పదేళ్ల పాటు స్వయంప్రతిపత్తి హోదా సంపాదించిందన్నారు. వాలీబాల్, ఖోఖో పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అవంతి క్రికెట్ కార్నివాల్ 2025 పోటీల గోడ పత్రికను ఆవిష్కరించారు. శాతశాతం ఉత్తీర్ణత సాధించిన కాడెట్స్, ఎన్‌సీసీ సమన్వయకర్త డా.హరికిరణ్‌ను అభినందించారు. టిడిఎస్ రమేష్ ఏర్పాటు చేసిన ధ్వన్యనుకరణ(మిమిక్రి), సంగీత విభావరి అలరించింది. విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ప్రకృతి వ్యవసాయం అభివృద్ధికి కృషి

కశింకోట: ప్రకృతి వ్యవసాయం అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా ప్రకృతి వ్యవసాయం అధికారి సిహెచ్. లచ్చన్న తెలిపారు. మండల ప్రకృతి వనరుల కేంద్రం నిర్వాహకురాలు కూండ్రపు అరుణ ఆధ్వర్యంలో మండలంలోని సుందరయ్యపేటలో అనకాపల్లి, విశాఖ, విజయనగరం జిల్లాలకు చెందిన 55 మంది ప్రకృతి వ్యవసాయం వనరుల బయోరిసోర్స్ పర్సన్లకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయానికి వినియోగించే కషాయాలు, ద్రావణాల తయారీపై శిక్షణ ఇచ్చారు. దీన్ని పరిశీలించిన సందర్భంగా జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఇక్కడ నేర్చుకున్న అంశాలను గ్రామస్థాయిలో రైతులకు వివరించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించి మిగిలిన రైతులను ప్రకృతి వ్యవసాయ సాగు పట్ల ఆకర్షితులను చేయాలన్నారు. 9వ బ్యాచ్‌కు నాలుగు రోజులపాటు శిక్షణ ఇస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంలో భూమి సారవంతానికి, పంటల దిగుబడి, చీడపీడలు, పురుగుల నివారణకు వినియోగించే ఘన, ద్రవ జీవామృతం, 12 రకాల కషాయాలు, ద్రవ్యాల తయారీపై సమగ్రంగా శిక్షణ ఇచ్చారు. డ్రోన్ ద్వారా వరి పంటపై ద్రావణాలు పిచికారీ చేయడంపై అవగాహన కలిగించారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఎన్‌ఎఫ్‌ఏ సత్తిరాజు, ఎల్ 1లు డి. రమణ, గంటా వెంకటఅప్పారావు, రామగోవింద, డి. వెంకటలక్ష్మి, డి. వరలక్ష్మి, ఐసీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణను విజయవంతం చేయండి


కోటి సంతకాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, టౌన్ పార్టీ అధ్యక్షుడు ఏకా శివ

నర్సీపట్నం : మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి పిలుపునిచ్చారు. మున్సిపాలిటీకి సంబంధించి మంగళవారం కోటి సంతకాల సేకరణ వాల్‌పోస్టర్లను టౌన్ పార్టీ అధ్యక్షుడు ఏకా శివ తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే సంకల్పంతో గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైద్య కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. కూటమి ప్రభుత్వం వీటిని ప్రైవేటు పరం చేస్తుందన్నారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములై ప్రభుత్వ నిర్ణయాన్ని తిప్పికొట్టాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జగదీశ్వరి, కోఆప్షన్ సభ్యులు షేక్ రోజా, పార్టీ నాయకులు తమరాన శ్రీను, మామిడి శ్రీను, లోకవరపు శారద, గంటా లలిత, లోకవరపు శ్రీను, జాన్ వరలక్ష్మి పాల్గొన్నారు.

బియ్యం వేలం పాట వాయిదా


వేలం పాటు నిర్వహిస్తున్న తహసీల్దార్ వేణుగోపాల్

నాతవరం : ప్రభుత్వం నిర్ణయించిన రేటు రాకపోవడంతో బియ్యం వేలం పాటు వాయిదా వేశామని నాతవరం తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ అన్నారు. మండలంలో డి.యర్రవరం పౌరసరఫరాల శాఖ గిడ్డంగిలో మంగళవారం 6ఏ కేసులో నమోదైన బియ్యానికి బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటకు మొత్తం 16 మంది పాటదారులు రూ. 5వేలు నగదు ముందుగా చెల్లించి పాటలో పాల్గొన్నారు. వేలం పాట నిర్వహించే బియ్యం 2023లో అక్రమంగా తరలిస్తుండగా పట్టుబడ్డాయని అప్పట్లో 6ఏ కేసు నమోదు అయిందన్నారు. ఆ బియ్యం సుమారుగా 21 టన్నులు 500 కేజీలు ఉందన్నారు. కలెక్టరు, జాయింట్ కలెక్టరు ఆదేశాల ప్రకారం వేలం పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. బయట మార్కెట్లో ఉన్న డిమాండ్ రిత్యా కేజీ బియ్యం రూ.31 చొప్పున నిర్ణయించారన్నారు. ఆ పైన పాట పాడిన వారికి వేలం పాట ఖరారు చేస్తామన్నారు. అయితే పాటదారులంతా 31 రూపాయలు మించి పాట పాడకపోవడంతో రద్దు చేశామన్నారు. మరలా పాట ఎప్పుడు నిర్వహిస్తామనేది జాయింట్ కలెక్టరు ఆదేశాలు వచ్చాక తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గొడౌన్ ఇన్‌చార్జి సుధాకర్, వీఆర్వో, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా నల్లకొండమ్మ తల్లి పండగ


అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు


గ్రామంలో ఆకర్షణీయంగా శక్తి వేషాలు


అలంకరణతో అమ్మవారి దర్శనం

నాతవరం : మండలంలో డి.యర్రవరం గ్రామంలో వెలసిన నల్లకొండమ్మ తల్లి పండగ మహోత్సవాన్ని భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. అమ్మవారి దర్శనం కోసం మంగళవారం తెల్లవారు నుంచే భక్తులు క్యూలో గంటలు తరబడి నిరీక్షించారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయమంతా ఉదయం నుంచి సాయంత్రం వరకు కిక్కిరిసిపోయింది. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ నిర్మాణకర్త చింతంరెడ్డి బెన్నయ్యనాయుడు ఆధ్వ ర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. వారికి ఉచితంగా తీర్థప్రసాదాలు అందజేశారు. పండగ సందర్భంగా గ్రామంలో శక్తి వేషాలు మహిళలతో కోలాటాలు ఏర్పాటు చేయడంతో ఎంతగానో ఆకట్టుకున్నాయి. సా యంత్రం అమ్మవారి ఆలయంలో భజనలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. నాతవరం ఎస్‌ఐ వై.తారకేశ్వరరావు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉత్సాహంగా గుర్రాల పరుగు పోటీలు


జెండా ఊపి పోటీలు ప్రారంభిస్తున్న రావాడ నాయుడు


పోటీల్లో దౌడు తీస్తున్న గుర్రం

నాతవరం: డి.యర్రవరంలో నల్లకొండమ్మ తల్లి పండగ నిర్వహించిన గుర్రాల పరుగు పోటీలు మంగళవారం ఉత్సాహంగా జరిగాయి. మొత్తం 16 గుర్రాలు పాల్గొన్నాయి. విజేతలకు నిర్వాహకులు నగదుతో పాటు అమ్మవారి షీల్డు అందజేశారు. విజేతలకు వరుసగా రూ.15వేలు, రూ.12వేలు, రూ.10 వేలు,రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు చొప్పున నగదు బహుమతులు అందజేశారు. పాల్గొన్న మిగిలిన గుర్రాల యజమానులకు రూ.2వేలు చొప్పున నగదు, షీల్డు అందజేశారు. పోటీలను నర్సీపట్నం చెందిన జ్యాయలరీ వ్యాపారి రావాడ నాయుడు జెండా ఊపి ప్రారంభించారు.

రాష్ట్రీయ పోషణ్ మహా పోషణ సదస్సులు


ఎంపిక చేసిన ఉత్తమ తల్లిదండ్రులను సన్మానిస్తున్న సంస్థ ప్రతినిధులు

రావికమతం : మండలంలో చీమలపాడు పంచాయతీలోని గిరిజన రాష్ట్రీయ మహాపోషణ 2025పై సమిధ స్వచ్ఛంద సంస్థ అధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కంజుర్తి, ధర్మవరం, చీమలపాడు, కళ్యాణపులోవ, తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, తల్లులుకు అందించే సేవలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. గర్భిణి సమయంలో పౌష్టికాహార ప్రాముఖ్యత, పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాల ప్రాముఖ్యత, వ్యాధి నిరోధక టీకాలు, విటమిన్-ఎ, డి-వార్మింగ్ సప్లిమెంట్స్ తదితర అంశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లల తల్లిదండ్రుల్లో వారికున్న అవగాహన, పిల్లల పట్ల చూపించే శ్రద్ధ, తీసుకొనే జాగ్రత్తలు వంటివి పరిశీలించి ఉత్తమ తల్లిదండ్రులుగా ఎంపిక చేసి సమావేశంలో వారిని సన్మానించారు. కార్యక్రమంలో సమిద సంస్థ కార్యదర్శి డి.వీరభద్రరావు, సమిద బోర్డు మెంబర్ నల్లి కల్యాణ్, సంస్థ ప్రోగామ్ మేనేజర్ లగుడు వరహాలబాబు పాల్గొన్నారు.

ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కోసం వినతి

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలంలో పరిశ్రమల ఏర్పాటు కోసం ఏపీఐఐసీ ద్వారా భూములను తీసుకొని ఇప్పటి వరకూ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేయకుండా ఇబ్బంది పెడుతున్నారని, తమ తగిన న్యాయం చేయాలని కోరుతూ కృష్ణంపాలెం బాధితులు మంగళవా రం ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. 2006లో భూములు తీసుకొని పరిహారం ఇచ్చారని, గ్రామ తరలింపులో భాగంగా అమలు చేసే ఆర్అండ్ ఆర్ ప్యాకేజీ విషయంలో తీవ్ర గందరగోళం సృష్టిస్తున్నారని వాపోయారు. 2023 సెప్టెంబర్ 9న విడుదల చేసిన జీవో నంబర్ 846 ప్రకారం 32.49 ఎకరాల భూమిని పంచదార్ల రెవెన్యూ పరిధిలో కేటాయించినప్పటికీ అప్పుడు ఎంపిక చేసిన అర్హులను మళ్లీ మార్చారని ఆరోపించారు. 2023 ఎన్యుమరేషన్‌లో అర్హులైన వారిని మళ్లీ 2025లో చేపట్టిన ఎన్యుమరేషన్‌లో అనర్హులుగా మార్చి మళ్లీ కొత్తవారిని చేర్చి లాటరీ పద్ధతిలో ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద దిబ్బపాలెం సెజ్ పరిధిలో ఇళ్ల స్థలాలు ఇస్తామనడం అన్యాయమన్నారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో అర్హుల జాబితాను మార్చిన వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. 2023 ఎన్యుమరేషన్ ప్రకారం గుర్తించిన అర్హులకు పంచదార్లలోనే ఇళ్ల ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

ఉపాధి హామీ పనులపై నేడు ప్రజావేదిక

కె.కోటపాడు : మండలంలో 32 పంచాయతీలలో ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకూ జరిగిన ఉపాధి పనులపై ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఏపీవో అప్పలరాజు తెలిపారు. గ్రామాల్లో జరిగిన పనులపై ఎస్ఆర్పీలు నిర్వహించిన సామాజిక తనిఖీలలో గల అంశాలను ఈ ప్రజా వేదిక కార్యక్రమంలో వివరించనున్నట్టు తెలిపారు.కార్యక్రమానికి డ్వామా పీడీ పూర్ణిమాదేవి, ఎంపీపీ రెడ్డి జగన్ మోహన్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ హాజరవుతారన్నారు. వీరితో పాటు పాటు గ్రామాల్లో గల సర్పంచ్, ఎంపీటీసీలు తప్పకుండా ప్రజా వేదిక కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

సత్యసాయి భక్తుల అన్నసమారాధన


రామాలయంలో పేదలకు అన్నదానం చేస్తున్న సత్యసాయి భక్తులు

కె.కోటపాడు : కె.కోటపాడులో గల సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి రోజూ పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సత్యసాయి సేవా సమితి గ్రామ కన్వీనర్ బండారు నారాయణపాత్రుడు తెలిపారు. మంగళవారం నిత్య నారాయణసేవ కార్యక్రమంలో భాగంగా అన్నదానంను జరిపారు. బండారు లక్ష్మణ రోహిత్ పాత్రుడు, రామ రోహిత్ పాత్రుడు, సరిత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు.

చింతలపూడికి తాత్కాలిక రేషన్ స్టాక్ పాయింట్ మంజూరు


విలేకర్లతో మాట్లాడుతున్న సీపీఎం నాయుకులు వెంకన్న, దొర

దేవరాపల్లి: చింతలపూడి పంచాయతీకి ప్రత్యేక రేషన్ స్టాక్ పాయింట్ మంజూరు చేస్తూ అనకాపల్లి ఆర్డీవో ఆదేశాలు జారీ చేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న, మండల కార్యదర్శి బి.టి.దొర తెలిపారు. దేవరాపల్లిలో మంగళవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. చింతలపూడి పంచాయతీకి దశాబ్దాలుగా రేషన్ డిపో లేక 12 గ్రామాల గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూ తామరబ్బ పంచాయతీలోని ముకుందపురం వెళ్లి రేషన్ తెచ్చుకుంటున్నారని తెలిపారు. గిరిజనుల పోరాట ఫలితంగా తహసీల్దార్, సీఎస్‌డీటీ సిఫార్సులతో ఆర్డీవో తాత్కాలిక రేషన్ స్టాక్ పాయింట్ మంజూరు చేయడం హర్షదాయకమన్నారు. ఇందుకు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే రేషన్ డిపో ఏర్పాటు చేసి గిరిజనుల కష్టాలు తీర్చాలన్నారు.

30 మంది నూతన ఉపాధ్యాయుల చేరిక

మాడుగుల రూరల్: 2025 డీఎస్సీ ద్వారా ఎంపికైన వారు మండలంలో 30 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరారని ఎంపీవో బి. దేముడమ్మ మంగళవారం తెలిపారు. వీరిలో క్లియెర్ వేకిన్స్‌లో 16 మందితో పాటు ఆరుగురు క్లస్టర్ ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. వీరితో పాటు నర్సయ్యపేట గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత బాలుర పాఠశాలల్లో నలుగురు సెకండరీ గ్రేడు ఉపాధ్యాయులు, తాటిపర్తి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలల్లో ఇద్దరు సెకండరీ గ్రేడు ఉపాధ్యాయులు, ఇద్దరు స్కూలు అసిస్టెంట్లు ఉపాధ్యాయులు విధుల్లో చేరారన్నారు. మండలంలో ఒక సెకండరీ గ్రేడు, ముగ్గురు హిందీ పండిట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులను అమె అభినందించారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ


కంప్యూటర్ పరిజ్ఞానంపై బాలికలకు శిక్షణ

రావికమతం : కొత్తకోట హైస్కూల్‌లోని పదో తరగతి విద్యార్థినులకు వృతి విద్యా -స్వయం ఉపాధి కోర్సుల్లో నైపుణ్యంపై ప్రత్యేక శిక్షణ పథకం కింద బాలికలకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ పరిజ్ఞానం, రైల్వే రిజర్వేషన్ టికెట్ బుకింగ్, ఆన్‌లైన్ సర్వీసులపై అవగాహన కల్పిస్తూ పది మంది విద్యార్థులు శిక్షణ పొందారని హెచ్ఎం జేజే రాజ్‌కుమార్ చెప్పారు. ఒకేషనల్ ట్రైనర్ ఎస్.మీనాక్షి విద్యార్థులకు వృత్తి నైపుణ్యంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగ అవకాశాలతో పాటు స్వయం ఉపాధికి వృత్తి నైపుణ్య శిక్షణ దోహదపడుతుందని హెచ్ఎం చెప్పారు.